సాక్షి ఖమ్మం

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



ఆధునికీకరణ 2.0

వైరా రిజర్వాయర్ ఆధునికీకరణకు ఏళ్ల తర్వాత రూ.42కోట్లు మంజూరవడంతో ఇటీవల పనులు ప్రారంభించారు. 8లో



ఆడపిల్లలు పుట్టారని దత్తత?

ఓ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా.. మళ్లీ కవల కుమార్తెలు జన్మించడంతో దత్తత ఇచ్చారనే సమాచారంతో విచారణ చేపట్టారు. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 24°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నం సమయాన వడగాలులు వీచే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

మధిర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం మధిరలో పర్యటించనున్నారు. మధిరలో రూ.120కోట్లతో నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి ఉదయం 11గంటలకు మధిర ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత 11–40గంటలకు వంగవీడులో, 12గంటలకు క్రిష్టాపురంలో, 12–30గంటలకు ఆత్కూరు – పులిగుట్టకు బీటీ రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్ టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి రెడ్డిపల్లిలో పద్మశ్రీ వనజీవి రామయ్య భౌతిక కాయం వద్ద ఆయన నివాళులర్పిస్తారు. అనంతరం ఖమ్మంతో పాటు పాలేరు నియోజకవర్గంలో పలు ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరయ్యాక రామయ్య అంతిమయాత్రలో పాల్గొంటారు.

వేంకటేశ్వరస్వామికి అభిషేకం, నిత్యకల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూల విరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం తరలింపు



ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న డీసీఓ చందన్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి 1,588.760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా మిల్లర్లకు చేరవేశామని వెల్లడించారు. రైతులు నాణ్యతాప్రమాణాలతో ధాన్యం తీసుకొస్తే ఆలస్యం జరగదని ఆయన తెలిపారు. కాగా, జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను డీసీఓ శనివారం పరిశీలించగా, డీటీ విజయ్‌బాబు, ఆర్‌ఐ నరేష్ పాల్గొన్నారు.

మేడేపల్లిలో కేంద్ర బృందం



గ్రామంలోని నర్సరీలో పరిశీలిస్తున్న అధికారులు

ముదిగొండ: ముదిగొండ మండలం మేడేపల్లిని కేంద్ర బృందం శనివారం సందర్శించింది. ఈ బృందంలో చంద్రాణిషాహ, పంకజ్‌కుమార్ ఉండగా.. రాష్టానికి చెందిన ఎస్‌సీఎం రాజయ్య, డీపీఓ ఆశాలత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించాక... గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ వీధిలైట్లు, సెగ్రిగేషన్ షెడ్లు, సోలార్ ఫెన్సింగ్, వననర్సరీని పరిశీలించి నిర్వహణపై ఆరా తీశారు. క్లైమెట్ యాక్షన్ స్పెషల్ పంచాయతీ అవార్డుకు ఎంపిక చేయడంలో భాగంగా గ్రామాన్ని సందర్శించినట్లు బృందం సభ్యులు తెలిపారు. తొలుత గ్రామస్తులు బతుకమ్మ, కోలాటంతో అధికారులకు స్వాగతం పలికారు. డీఎల్‌పీఓ నారాయణ, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓలు ఉపేంద్రయ్య, టీఎల్ఎన్.శాస్త్రి, రవీంద్రప్రసాద్, గ్రామస్తులు హరిప్రసాద్, రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వటవృక్షం నేలవాలింది...

దరిపల్లి రామయ్య అంటే జిల్లాలో ఎవరికీ పెద్దగా తెలియకపోవచ్చు. కానీ వనజీవి రామయ్య అంటే మాత్రం మెడలో వృక్షో రక్షతి రక్షితః అనే ఆకుపచ్చని బోర్డుతో ఉండే ఆయన రూపం వెంటనే గుర్తుకొస్తుంది. కరుణగిరి నుంచి మారెమ్మ గుడి మార్గంలో వెళ్లే వారు ఎప్పుడో ఒకసారి రోడ్డుపక్కన చెట్ల కింద గింజలు సేకరిస్తూ.. మొక్కలకు పాదులు చేసి రక్షణ కల్పిస్తుండే ఆయనను చూసి ఉంటారు. ఐదో తరగతి వరకే చదువుకున్న ఆయనకు మొక్కల ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై ఉపాధ్యాయుడు చెప్పిన మాట మనసులో బలంగా నాటుకుపోయింది. దీంతో మొక్కలు నాటడం, సంరక్షణే ధ్యేయంగా రామయ్య చివరివరకు పాటుపడ్డారు. అడవి తన పరిధిలో చెట్లను తానే పెంచుకుంటుంది.. జనం మధ్యలో మాత్రం మనమే పెంచాలి.. అని చెప్పే రామయ్య గుండెపోటుతో 88వ ఏట మృతి చెందగా, పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. కాగా, అంత్యక్రియలు పల్లెగూడెం శ్మశానవాటికలో ఆదివారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యాన జరగనున్నాయి.

– ఖమ్మంరూరల్



88 ఏళ్ల వయస్సులోనూ..

ఎనభై ఎనిమిదేళ్ల వయస్సులోనూ అవిశ్రాంతంగా రామయ్య ప్రతీరోజు మొక్కలు నాటేవారు. గుండెకు స్టంట్ వేసినా.. రోడ్డుప్రమాదంలో కాళ్లు విరిగినా ఇంటి ఆవరణ, సమీపంలో మొక్క నాటారే తప్ప యజ్ఞాన్ని ఆపలేదు. ఉమ్మడి ఏపీలో రామయ్యకు ద్విచక్రవాహనాన్ని సమకూర్చగా, హరిత నిధి ద్వారా నెలనెలా రూ.50వేలు ఇస్తున్నారు.



- జీవితం మొత్తం పర్యావరణ పరిరక్షణ కోసం తపించిన పర్యావరణ ప్రేమికుడు వనజీవి రామయ్య కోల్పోవడం చాలా బాధాకరమని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బి.హరినాథ్‌బాబు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.
- ఇంటి పేరునే వనజీవిగా మార్చుకున్న దరిపల్లి రామయ్య మృతి దేశానికే తీరని లోటని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పించాక ఆయన మాట్లాడుతూ కోటికి పైగా మొక్కలు నాటిన రామయ్య జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటారని కొనియాడారు. రామయ్యతో తనకు 1994 నుంచి పరిచయం ఉందని గుర్తు చేసుకున్నారు.

శిక్ష వద్దు.. మొక్కలు నాటించండి..

ప్రమాదంలో తాను గాయపడడానికి కారణమైన వ్యక్తికి శిక్ష కాకుండా మొక్కలు నాటించాలని చెప్పిన ప్రకృతి ప్రేమికుడు వనజీవి రామయ్య. 2022లో ఆయన స్వగ్రామమైన రెడ్డిపల్లిలో మొక్కలకు నీరు పోసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు స్పందించగా.. డ్రైవర్‌పై కేసు కాకుండా, 100 మొక్కలు నాటించాలని రామయ్య అభ్యర్థించారు.

వనజీవి పద్మశ్రీ రామయ్య కన్నుమూత

- నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందిన 'దరిపల్లి'
- కోటిన్నరకుపైగా మొక్కలు నాటిన మహారుషి
- ప్రధాని, సీఎం సహా నివాళులర్పించిన ప్రముఖులు
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

మొక్కలే ప్రాణం.. అభిమానం

పాఠశాల సమయాన ఉపాధ్యాయుడు జి.మల్లేశం మొక్కల పెంపకంతో లాభాలను వివరించడం రామయ్య మనస్సులో నాటుకుపోయింది. దీనికి 'సొంత లాభం కొంత మానుకుని పరుల కోసం సాయపడవోయ్' అన్న అనే గురజాడ సూక్తిని అందిపుచ్చుకున్న ఆయన తన ఇంటి నుండే మొక్కలు నాటడం ప్రారంభించారు. ఇంట్లో సగభాగానికి పైగా మొక్కలు నాటగా అవి వృక్షాలయ్యాయి. అంతటితో ఆగక నీడ, ఫలాలను ఇచ్చే మొక్కల విత్తనాలు సేకరించడం.. వర్షాకాలం ప్రారంభంలో రోడ్లు, కార్యాలయాలు, స్కూళ్లు, ఆలయాల వెంట నాటడం అలవాటైంది. అంతేకాక తాను నాటిన గింజలు మొక్క రూపం నుంచి మానుగా మారే వరకు నిత్యం పర్యవేక్షించేవారు. ఆయన జీవితాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతి తెలుగు పుస్తకంలో, తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘిక శాస్త్రంలో చేర్చడం రామయ్య కృషికి దక్కిన ఫలితమని చెప్పొచ్చు.

కుటుంబ సభ్యులకు చెట్ల పేర్లు

వనజీవి రామయ్య తన కుటుంబ సభ్యులకు చెట్ల పేర్లు పెట్టి మొక్కలపై మక్కువను చాటారు. మనవరాళ్లకు హరిత లావణ్య, చందన పుష్ప, కబంధ పుష్ప, వనశ్రీ పేర్లు పెట్టగా... తన సంతానం వివాహ సమయాన శుభలేఖలపై మొక్కల సమాచారం, ప్రాధాన్యతను ముద్రించారు. అంతేకాక కుటుంబీకుల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే చెట్ల పసరుతో వైద్యం చేసే రామయ్య... 120రకాల మొక్కల చరిత్రను క్షుణ్ణంగా చెప్పేవారు.

కోటిన్నరకు పైగా మొక్కలు..

తన జీవిత కాలంలో రామయ్య కోటిన్నరకు పైగా మొక్కలు నాటినట్లు అంచనా. భవిష్యత్ తరాల మనుగడకు మొక్కలే ఆధారమని నమ్మే ఆయన ఊరూరా ప్రచారం చేసేవారు. ఏ కార్యానికి వెళ్లినా మొక్కలనే బహుమతిగా ఇచ్చేవారు. అయితే, తాను కన్నుమూసేలోగా 3కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యంగా చెప్పే రామయ్య మధ్యలో కన్నుమూశారు. కాగా, ప్రభుత్వం తనకు 20ఎకరాల భూమి కేటాయిస్తే అందులో మొక్కలు పెంచి వాటి ప్రత్యేకతలు, పెంపకం ఆవశ్యతను ప్రజలకు అవగాహన కల్పిస్తానని అధికారులను కోరేవారు. అంతేకాక ఆ చెట్ల గింజలతో మొక్కలు పెంచి ప్రజలకు ఉచితంగా ఇస్తానని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.

అటవీశాఖ ఉద్యోగులకు పాఠాలు

మొక్కల పెంపకమే కాదు అటవీశాఖ ఉద్యోగులకు పాఠాలు చెప్పేవారు. శిక్షణ పూర్తి చేసుకున్న అటవీశాఖ ఉద్యోగులు రామయ్యను కలవడం ఆనవాయితీ కాగా.. ఆయన తన అనుభవాలను వివరించేవారు. కాగా, తన ఇంట్లో రామయ్య నాటిన ఎర్రచందనం చెట్ల ద్వారా దాదాపు 20టన్నుల ఎర్ర చందనం వచ్చింది. ఇక కరెన్సీ నోట్లపై మొక్కలు నాటే చిత్రాన్ని ప్రచురించాలని, తద్వారా అందరికీ ప్రాధాన్యత తెలుస్తుందని రామయ్య కేంద్ర ప్రభుత్వానికి ఓసారి విన్నవించారు.

పద్మశ్రీ సహా అవార్డులెన్నో..

రామయ్య ప్రకృతిపై పెంచుకున్న ప్రేమతో అవార్డులే వెతుక్కుంటూ వచ్చాయి. కోటి మొక్కలు నాటిన సందర్భంగా ఆయన ట్రీమ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందారు. 1995లో కేంద్ర ప్రభుత్వం నుంచి రామయ్య వనసేవా అవార్డు అందుకున్నారు. అలాగే, 2005లో సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ ఢిల్లీలో వనమిత్ర అవార్డును అప్పటి ప్రధాని చేతుల మీదుగా అందజేసింది. గతంలో ఖమ్మం కలెక్టర్లుగా పనిచేసిన వారి చేతుల మీదుగా కూడా పలు అవార్డులు స్వీకరించారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఆయన కృషిని గుర్తించి పద్మశ్రీ ప్రకటించగా ఆనాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. ఇన్ని అవార్డులు సొంతమైనా మొక్కలు పంపిణీ, నాటడం ఆపకపోగా.. రామయ్య ఆశయ సాధనలో భార్య జానకమ్మ చేదోడుగా నిలిచారు.



రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

పాట పాడుతూ నిద్రలోకి...

ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెంకు చెందిన దరిపల్లి లాలయ్య – పుల్లమ్మ దంపతులకు 1937 జూలై 1న రామయ్య జన్మించారు. ఆయన కుటుంబానికి రెడ్డిపల్లి వద్ద పొలాలు ఉండడంతో ఇక్కడకు వచ్చి నివాసం ఏర్పర్చుకున్నాడు. ఆతర్వాత తల్లాడకు చెందిన జానకమ్మతో ఆయనకు వివాహమైంది. శాలివాహన కులానికి చెందిన రామయ్య కుండలు చేస్తూనే ప్రవృత్తిరీత్యా మొక్కలు పెంచడం అలవాటుగా మార్చుకున్నారు. వీరికి ముగ్గురు కుమారులు సైదులు, సత్యనారాయణ, కనకయ్య, కుమార్తె సైదమ్మ సంతానం కాగా కుమారులు సైదులు, సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం రాత్రి వనాలు, చెట్ల ప్రాధాన్యతను వివరించే పాట పాడుతూ రామయ్య నిద్రలోకి జారుకున్నారు. అయితే, రోజూ ఉదయాన్నే 4గంటలకే లేచే ఆయన 6గంటలైనా మేల్కొనకపోవడంతో భార్య తట్టినా ఫలితం కానరాలేదు. దీంతోకుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సరికి గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అన్నిరంగాల్లో అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అభివృద్ధి పనులకు ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి శంకుస్థాపన



జింకలతండాలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/రఘునాథపాలెం: ఖమ్మం నియోజకవర్గాన్నే కాక జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో కోల్డ్ స్టోరేజీను ప్రారంభించగా, 58వ డివిజన్ దొరన్న కాలనీలో రూ.కోటి నిధులతో నిర్మించే సీసీ రోడ్డు, స్మార్ట్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం, రఘునాథపాలెం మండలం జింకల తండాలో రూ.2.50కోట్లతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశాక మంత్రి మాట్లాడారు. దొరన్న కాలనీలో అభివృద్ధి పనులకు కావాల్సిన మేర నిధులు కేటాయిస్తామని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే, జింకల తండాలో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల వేర్‌హౌస్ గోదాం వద్దకు మెరుగైన రవాణా కోసం రోడ్డు నిర్మిస్తుండగా రూ.1.50కోట్ల వ్యయంతో జింకల తండా నుంచి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వరకు బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ గత 16 నెలలుగా ఖమ్మం నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. ఖమ్మం మేయర్ పి.నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేటర్ దొరేపల్లి శ్వేత, సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.శ్రీలత, ఆర్డీఓ నర్సింహారావు, అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, తహసీల్దార్లు రవికుమార్, విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి అప్రజాస్వామిక విధానాలు

రఘునాథపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తూ ప్రజల హక్కులకు భంగం కలిగిస్తోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి పేర్కొన్నారు. రఘునాథపాలెంలో కాంగ్రెస్ మండల కమటీ ఆధ్వర్యాన నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' యాత్రలో వారు మాట్లాడారు. రఘునాథపాలెం ఎంపీడీఓ కార్యాలయ జంక్షన్ నుంచి గ్రీన్ కాలనీ వరకు యాత్ర కొనసాగింది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు సాధు రమేష్‌రెడ్డి, యరగర్ల హన్మంతరావు, తాత రఘురాం, దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, వాంకుడోత్ దీపక్, భూక్యా బాలాజీ, కేలోతు దేవ్‌సింగ్, రామ్మూర్తి, బండి వెంకన్న, జోనెబోయిన పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి ఎదురుకావొద్దు

ఖమ్మం వన్‌టౌన్: జిల్లాలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఆదేశించారు. ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 50కు పైగా బోర్లకు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

ప్రచండభానుడు

- జిల్లాలో పెరిగిన సూర్యప్రతాపం
- అత్యధికం.. 43.3 డిగ్రీలుగా నమోదు



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో సూర్య ప్రతాపం పెరిగింది. రోజు వ్యవధిలోనే ఎండ తీవ్రత పెరగడంతో జనం ఇక్కట్లు ఎదుర్కొన్నారు. శుక్రవారంతో పోలిస్తే శనివారం 2.2 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడం..ఉదయం 9గంటల నుంచే ఎండ తీవ్రత మొదలుకావడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇక ఎండల కారణంగా పగలు, రాత్రి వేళల్లో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. అయితే వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గడంతో జిల్లాకు కేటాయించిన కోటా మాత్రం దాటడం లేదు. జిల్లాకు నిత్యం 5.95 మిలియన్ యూనిట్లు కేటాయిస్తుండగా, శుక్రవారం 5.82 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు తెలిపారు.

బాణాపురంలో అత్యధికం

ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో శుక్రవారం అత్యధికంగా 41.1 డిగ్రీలు, ఖమ్మం, నేలకొండపల్లిల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయితే, శనివారం ఇంతకుమించి ముదిగొండ మండలం బాణాపురంలో 43.3 సెల్సియస్ డిగ్రీలుగా నమోదు కావడం గమనార్హం. అలాగే, పమ్మి, ఎర్రుపాలెంలో 43.2, ఖమ్మం ఖానాపురం, పల్లెగూడెం, వైరాలో 43, మధిరలో 42.9, కుర్నవల్లి, వైరా, మధిర(ఏఆర్ఎస్), సిరిపురంలో 42.8, చింతకాని, బచ్చోడులో 42.6, తల్లాడ, గంగారంలలో 42.5, నేలకొండపల్లిలో 42.4, ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో 42.2, ముదిగొండ, సత్తుపల్లి జేవీఆర్ ఓసీపీ, ఏన్కూరులో 42.1, కొణిజర్ల 42 డిగ్రీలుగా నమోదైంది. ఇక సత్తుపల్లిలో 41.9, పెద్దగోపతి, ఖమ్మం ఎస్ఎస్‌పీ గెస్ట్‌హౌస్, తిరుమలాయపాలెంలో 41.8, వేంసూరులో 41.6, గేటు కారేపల్లి, రఘునాథపాలెం, లింగాల, కాకరవాయిలో 41.5, సదాశివునిపాలెంలో 41.3, తిమ్మారావుపేటలో 41, గుబ్బగుర్తి 40.9, మంచుకొండ 40.7, పంగిడి 40.5, గొరారం 40.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం బెంబేలెత్తిపోయారు.

బ్రహ్మోత్సవాలు 'పరిపూర్ణం'



గోదావరిలో చక్రస్నానం



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

- భద్రాచలం వద్ద గోదావరిలో వైభవంగా చక్రస్నానం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గత నెల 30న ప్రారంభమైన వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజైన శనివారం స్వామివారి సుదర్శన చక్రానికి చక్రస్నానం కమనీయంగా జరిపారు. సుదర్శన చక్రాన్ని, ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పవిత్ర గోదావరి వద్దనున్న పునర్వసు మండపం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు మండపంలో స్నపన తిరుమంజనం, హారతి సమర్పించారు. అనంతరం గోదావరిలో సుదర్శన చక్రానికి సంప్రదాయబద్ధంగా చక్రస్నానం జరిపారు. సాయంత్రం ధ్వజావరోహణం, దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు నిర్వహించారు. యాగశాలలో పుష్పయాగం, పూర్ణాహుతిలతో బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేశారు. సాయంత్రం శేష వాహనంపై స్వామివార్లను కొలువుదీర్చి తిరువీధి సేవ గావించారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, పండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో భక్తుల రద్దీ

వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రామాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. మూడు రోజుల సెలవుల తోపాటు హనుమాన్ విజయోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో హనుమాన్ మాలధారులు భద్రగిరికి తరలివచ్చారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకోగా, మాలధారులు మాల విరమణ గావించారు.

నేటి నుంచి నిత్యకల్యాణాలు, దర్బారు సేవలు ప్రారంభం

తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా బేడా మండపంలో నిలిపివేసిన నిత్యకల్యాణాలు, దర్బారు సేవలు ఆదివారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. స్వామివారి నూతన పర్యంకోత్సవం ఈ నెల 22న జరపనున్నారు. పవళింపు సేవలు కూడా అదే రోజు నుంచి నిర్వహించనున్నారు. ఆదివారం చిత్తనక్షత్రం సందర్భంగా సుదర్శన హోమాలను జరుపుతారు.

గేట్లకు లీకేజీ.. అడ్డుగా గడ్డి కట్టలు!



లీకేజీల వద్ద వేసేందుకు గడ్డికట్టలు తీసుకొస్తున్న సిబ్బంది

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుంచి దిగువకు నీటి సరఫరాను శుక్రవారం నిలిపివేసిన విషయం తెలిసిందే. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం శనివారానికి 22అడుగులతో నిండుకుండలా మారింది. ఈక్రమాన ఎడమ కాల్వకు నీరు సరఫరా అయ్యే గేట్ల(ఔట్‌ఫాల్ గేట్లు)ను సైతం మూసివేయగా కొన్నిచోట్ల లీకేజీలను గుర్తించారు. ఇదిలాగే కొనసాగితే రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా తగ్గే అవకాశముందని భావించిన అధికారులు నష్టనివారణ చర్యలు చేపట్టారు. గేట్ల లీకేజీల వద్ద గడ్డి కట్టలు అడ్డుగా వేయించారు. దీంతో పాటు ఇటీవల భారీ వరదలతో కాలువ కోతకు గురైన చోట కూడా అడ్డుకట్టలు వేయడంతో లీకేజీలు తగ్గుముఖం పట్టాయి. అయితే, ఏటా సిబ్బంది ఇలాగే గడ్డికట్టలతో లీకేజీలను నిలువరిస్తున్నారు. గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తే ఈ ఇబ్బందులు ఉండవని తెలుస్తోంది. ఈవిషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా వానాకాలం సీజన్‌లోగా గేట్ల మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు.



ఔట్ ఫాల్ గేట్ల నుంచి లీకేజీ అవుతున్న నీరు

క్లుప్తంగా

ఆర్పీఎఫ్ సీఐగా సురేష్‌గౌడ్


సురేష్‌గౌడ్

ఖమ్మంక్రైం: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) ఖమ్మం సీఐగా బుర్ర సురేష్‌గౌడ్ నియమితులయ్యారు. ఇన్నాళ్లు సీఐగా ఉన్న శ్రీనివాసరెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి స్టేషన్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో రామగుండం ఆర్పీఎఫ్ సీఐగా పనిచేస్తున్న సురేష్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ... రైల్వే ఆస్తుల పరిరక్షణతో పాటు ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, రైళ్లలో నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికడతామన్నారు.

వాల్యుయేషన్ కేంద్రం వద్ద నిరసన

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి వాల్యుయేషన్ కేంద్రం వద్ద శనివారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జక్కంపుడి జగదీష్ మాట్లాడుతూ గతంలో మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించలేదని, ఇకనైనా స్పందించకపోతే ఈనెల 15న ధర్నా చేస్తామని వెల్లడించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు రంజాన్, విజయ్, కట్టా శేఖర్ తదితరులు మద్దతు పలకగా, నాయకులు శ్రీనివాసరావు, నాగేశ్వరావు, షఫీ, ముజీబ్, బాబురావు, సువర్ణ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తల్లాడ: మండలంలోని వెంకట్రాముని తండా శివారు అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై తల్లాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి పేకాటరాయుళ్లను అరెస్టుచేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకోగా మరో నలుగురు పరారయ్యారని ఎస్సై బి.కొండల్‌రావు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.10,900 నగదు, ఏడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చిన్నబీరవల్లిలో...

బోనకల్: బోనకల్ మండలం చిన్నబీరవల్లిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై మధుబాబు తెలిపారు. వీరి నుంచి రూ.2,500 నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

కల్లూరు: మండలంలోని ముగ్గు వెంకటాపురం వద్ద మృతి చెందిన వ్యక్తి ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఏపీలోని తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం మాసాపేటకు చెందిన తంబుర మురళి(25) ఆటోడ్రైవర్‌గా పనిచేసేవాడని తెలిపారు. మతిస్థిమితం లేక బయట తిరిగే ఆయన ముగ్గు వెంకటాపురం చేరుకోగా, అపస్మారక స్థితికి చేరి మృతి చెందాడని భావిస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని ఆయన సోదరుడికి శనివరాం అప్పగించారు.

వందల సంఖ్యలో నెమళ్లు!

బోనకల్: బోనకల్ మండలం గోవిందాపురం (ఏ) గ్రామ సమీపంలో వందకు నెమళ్లు సంచరిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామ సమీపాన ప్రకృతివనం, శ్మశానవాటికకు ఆనుకుని సుబాబుల్ తోట ఉంది. ఇది ఏపీ – తెలంగాణ సరిహద్దులో ఉండటంతో నెమళ్లు సంచరిస్తున్నాయని ఇందులో పిల్లలు కూడా ఉన్నాయని వెల్లడించారు. అటవీ అధికారులు వాటి సంరక్షణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా, నెమళ్ల సంచారంపై స్థానికులు తీసిన వీడియో వైరల్‌గా మారింది

ఆధునికీకరణ 2.0

వైరా రిజర్వాయర్ రెండోదశ అభివృద్ధి పనులకు అడుగులు

- రిజర్వాయర్‌పై ప్రత్యేక దృష్టితో రూ.42.10 కోట్లు కేటాయింపు
- వైఎస్ తర్వాత మళ్లీ ఇప్పుడే నిధులు..


వైరా రిజర్వాయర్

వైరా: వైరా రిజర్వాయర్ రెండోదశ ఆధునీకరణ పనులకు అడుగులు పడ్డాయి. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న వైరా రిజర్వాయర్‌ను అభివృద్ధి చేసేందుకు అధికారుల ప్రతిపాదనలతో ప్రస్తుతం తాజా బడ్జెట్‌లో రూ.42.10 కోట్లు మంజూరు చేసింది. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్ల పాటు అధికారులు ప్రతిపాదనలు చేసినా నిధులకు మోక్షం లభించలేదు. ఈసారి ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆమోదించగా నిధులు మంజూరయ్యాయి. 2009–11లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రూ.55 కోట్లు మంజూరు చేసి మొదటి దశ పనులకు శ్రీకారం చుట్టగా మళ్లీ ఇప్పుడే నిధులు కేటాయించడం విశేషం.

వైఎస్ హయాంలో మొదటి దశ..

డాక్టర్ వైఎస్సార్ చేపట్టిన పాదయాత్ర వైరా నియోజకవర్గం నుంచి వెళ్లిన క్రమాన రిజర్వాయర్ ఆధునికీకరణ ఆవశ్యకతను ఇక్కడి రైతులు విన్నవించారు. దీంతో ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రూ.55 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వకు గైడ్ వాల్వ్‌లు, లైనింగ్ అదనపు అలుగు, సెక్షార్ల నిర్మాణం వంటివి చేపట్టారు. దీంతో రిజర్వాయర్ ఆయకట్టు గతంతో పోలిస్తే పెరిగింది. నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో నిర్మించిన వైరా రిజర్వాయర్ పాలకుల నిర్లక్ష్యానికి గురి కాగా వైఎస్ హయాంలోనే ఆధునీకరణ జరిగిందని ఇప్పటికీ రైతులు గుర్తుచేసుకుంటారు.

రెండో దశలో ఇలా..

రిజర్వాయర్ ఆధునికీకరణ రెండో దశ పనులకు మళ్లీ ఇన్నాళ్ల తర్వాత మోక్షం లభించింది. కేబినెట్‌లో వైరా మండల వాసి భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగానే కాక ఆర్థిక శాఖ బాధ్యతలను చూస్తుండడంతో రూ.42.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో చేపట్టే పనుల్లో భాగంగా ఎడమ కాల్వ పరిధిలో ఆరు కిలోమీటర్ల మేర గైడ్‌వాల్వ్‌లు, మరో ఆరుకిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేపట్టేందుకు జంగిల్ క్లియరెన్స్ పనులు మొదలుపెట్టారు. రెండు రోజుల్లో సిమెంట్ కాంక్రీట్ పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరువైపులా గైడ్ వాల్వ్‌లు నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఖర్చు తగ్గించేందుకు రెండు వైపులా సీసీ లైనింగ్ చేస్తున్నారు. కుడి కాల్వ పరిధిలో కొండకొడిమ నుండి గొల్లపూడి వరకు, ఎడమ కాల్వ పరిధిలో 3.5 కిలోమీటర్ల మేర లైనింగ్ చేయనున్నారు. మొత్తం 12 కిలోమీటర్లు లైనింగ్ పనులు పూర్తి చేయనున్నారు.


రిజర్వాయర్ సమీపాన చేపడుతున్న జంగిల్ క్లీనింగ్ పనులు

లింగన్నపేట సమీపంలో రెండు కిలోమీటర్లు కాంక్రీట్ పనులు చేపట్టనున్నారు. రెండో దశ ఆధునీకరణ పనులు పూర్తయితే రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయగానే చివరి భూములకు కూడా ఒక రోజులో నీరు చేరనుంది. దీంతో పదేళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఆలస్యం కాకుండా పనులు..

రెండో దశ ఆధునికీకరణ పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో పనులను జూన్ మొదటి వారం వరకు పూర్తి చేస్తాము. చివరి భూములకు సైతం నీరు చేరేలా ఈ పనులు చేయిస్తున్నాం. రైతులు సహకరిస్తే మరింత త్వరగా పూర్తవుతాయి. – శ్రీనివాస్, ఐబీ డీఈ, వైరా

ఆడపిల్లలు పుట్టారని అక్రమంగా దత్తత?

ఆలస్యంగా బయటపడడంతో అధికారుల విచారణ


మల్లేష్ ఇంటి వద్ద విచారణ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చింతకాని: మొదటి, రెండు కాన్పుల్లో ఆడపిల్లలు.. మూడో కాన్పులోనూ ఆడపిల్ల అని తెలియగా అబార్షన్ చేయించడమే కాక.. నాలుగో కాన్పులో కవల ఆడశిశువుల జన్మించడంతో శిశువులను బంధువులకు దత్తత ఇచ్చిన ఘటన ఆలస్యంగా బయటపడింది. ఈ విషయం తెలిసి ఐసీడీఎస్ అధికారులు శిశువుల ఆచూకీపై ఆరా తీస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. చింతకాని మండలం నాగులవంచ రైల్వేకాలనీకి చెందిన నల్లగాజు మల్లేష్ – ఉమ దంపతులకు ఇప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మూడో కాన్పులోనూ గర్భంలో ఆడపిల్ల పెరుగుతోందని తెలియగా ఉమ అబార్షన్ చేయించుకుంది. ఆ తర్వాత మళ్లీ గర్భం దాల్చగా గత నెల 31న ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కవల ఆడ శిశువులకు జన్మనిచ్చింది. దీంతో కవల శిశువులను ఆస్పత్రిలోనే ఉమ తన అక్కకు దత్తత ఇచ్చేసి ఇంటికి వచ్చారు. మూడు రోజుల క్రితం ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు కలిసి ఉమ, శిశువు ఆరోగ్య వివరాలు తెలుసుకునేందుకు ఆమె ఇంటికి వెళ్లగా శిశువులు కానరాలేదు. ఏమైందని ఆరా తీయగా పోషించలేకనే బంధువులకు దత్తత ఇచ్చామని బదులిచ్చారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ, ఏసీడీపీఓ శివకుమారి, సూపర్‌వైజర్ పద్మావతి కలిసి మల్లేష్ ఇంటికి వెళ్లగా ఆయన 'మా పిల్లలు మా ఇష్టం.. ఏమైనా చేసుకుంటాం.. అడగానికి మీరెవరు' అంటూ దురుసుగా సమాధానం చెప్పారు. చట్టానికి లోబడి దత్తత ఇవ్వాలని, అలాకాకుండా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో ఉంటున్న ఉమ అక్కకు పిల్లలను దత్తత ఇచ్చామని, సోమవారం వరకు తీసుకొస్తామని, లేనిపక్షంలో ఏ చర్యలైనా తీసుకోవచ్చని లేఖ రాసి ఇచ్చారు. కాగా, ఐసీడీఎస్ అధికారులకు వీడియో కాల్ ద్వారా కవల ఆడ శిశువులను చూపించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

కూసుమంచి: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని నాయకన్‌గూడెం సమీపాన ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం వట్టిపల్లికి చెందిన వట్టికొట్టి శేఖర్(35) తన లారీలో భద్రాచలం నుండి పేపర్‌లోడ్‌తో హైదరాబాద్ వెళ్తుండగా నాయకన్‌గూడెం సమీపానికి రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి శేఖర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న శేఖర్ తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ఆయన సోదరుడు పాండు ఇచ్చిన ఫిర్యాదుతో ప్రమాదానికి కారణమైన మరో లారీ డ్రైవర్ జగన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐదు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు షురూ..


పరిచయం చేసుకుంటున్న దయాకర్‌రెడ్డి

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో ఐదు రాష్ట్రాల స్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

మంత్రి పొంగులేటి స్వగ్రామంలో వాటర్‌ప్లాంట్

పీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

కల్లూరురూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25 లక్షల వ్యయంతో మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. ఇందుకోసం స్థలాన్ని కూడా సమకూర్చారు. ఈ ప్లాంట్‌ను మంత్రి సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. నారాయణపురంతో పాటు పంచాయతీ పరిధిలోని కొత్త నారాయణపురం గ్రామాల వాసులకు సురక్షిత తాగునీరు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పొంగులేటి సురేందర్‌రెడ్డి, పన్నీరు కోటిరెడ్డి, కిక్కిరెడ్డి కృష్ణారెడ్డి, వలుకూరి సత్యనారాయణరెడ్డి, పైడిమళ్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఏర్పాట్లు..

నారాయణపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల సేకరణపై దృష్టి సారించారు. ఇక్కడ సబ్‌స్టేషన్ ఏర్పాటైతే ముగ్గు వెంకటాపురం, పేరువంచ, నారాయణపురం, కొర్లగూడెం, కొత్త నారాయణపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని స్థానికులు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సూచనలతో విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డిని శనివారం వారు కలిసి స్థలాన్ని సమకూర్చాలని కోరారు.

పోటీ ప్రపంచానికి తగినట్లుగా బోధన


వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి, యాజమాన్యం


నృత్యం చేస్తున్న విద్యార్థులు

'సెడార్ వ్యాలీ' వార్షికోత్సవంలో మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి

రఘునాథపాలెం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సెడార్ వ్యాలీ పాఠశాల యజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సెడార్‌వ్యాలీ పాఠశాల ప్రథమ వార్షికోత్సవం శనివారం జరగగా, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి బోధనను తల్లిదండ్రులకు అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఆరెకరాల స్థలంలో అత్యాధునిక వసతులతో పాఠశాల నెలకొల్పడం ప్రశంసనీయమన్నారు. తొలుత విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇస్రో మాజీ మిషన్ డైరెక్టర్ డాక్టర్ టీకే. సుందరమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, డైరెక్టర్లు పార్వతీరెడ్డి, చల్లపల్లి ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సర్వ సంపదలు సమానంగా ఉండాలి


ప్రతులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: సర్వసంపదలు అందరికీ సమానంగా ఉండాలనే స్ఫూర్తి మన రాజ్యాంగం కల్పించిందని సామాజిక విశ్లేషకుడు డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్ అన్నారు. శనివారం నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ అధ్యయన కేంద్రం ఆధ్వర్యాన 'భారత రాజ్యాంగం –సామాజిక న్యాయం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రవేశిక ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ బి.వీరన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కెఎస్.రామారావు, కేంద్ర సాహిత్య అకాడమీ గౌరవ సభ్యుడు ప్రసేన్, అధ్యాపకుడు, కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం, అధ్యయన కేంద్ర మాజీ కోఆర్డినేటర్ జె.రమేష్, వివిధ విభాగాల కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పెనుబల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బయ్యన్నగూడెంకు చెందిన దొంతు నరసింహారావు(42) భార్య పదిహేను రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబీకులు గమనించడంతో అప్పటికే అతను మృతిచెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేస్తున్నట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

కిరాణాషాప్‌లో నగదు, సామగ్రి చోరీ

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపాన ఉన్న కిరాణాషాప్‌లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఎస్సై నాగుల్ మీరా తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కాలనీకి చెందిన సింగారపు రమణ పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద నిర్వహిస్తున్న తన కిరాణషాప్‌నకు శుక్రవారం రాత్రి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున షాప్ ఎదుట బొలేరో ఆపిన నలుగురు వ్యక్తులు షాప్ తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. అదే సమయాన కూలీ పనులకు వెళ్తున్న రమణ కుమారుడు ఉదయ్ గమనించి తండ్రికి ఫోన్ తెలపగా రమణ వచ్చేలోగా దుండగులు పరారయ్యారు. ఈ మేరకు రూ.10వేల నగదుతో పాటు కొంత సామగ్రి చోరీ జరిగిందనే ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెట్రోల్ బంక్‌లో..

మధిర: మధిరలోని నందిగామ రోడ్డు సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంకులో శుక్రవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున బంక్ సిబ్బంది నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి గదిలోకి వచ్చి వారి జేబుల్లో వెతికాడు. ఇంతలో సిబ్బందిలో ఒకరికి మెళకువ రాగా.. నిద్రమత్తులో పెట్రోల్ లేదని చెప్పి మళ్లీ నిద్రకు ఉపక్రమించాడు. ఆతర్వాత దుండగులు పక్కనే ఉన్న గది టేబుల్ సొరుగు నుంచి రూ.25 వేలు ఎత్తుకెళ్లారు. ఇదంతా బంక్‌లోని సీసీ కెమెరాల్లో నమోదు కాగా, బంక్ మేనేజర్ రాజేష్ శనివారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ అడిషనల్ ఎస్‌ఐ చంద్రశేఖర్‌రావు తెలిపారు.

హెల్మెట్ లేదని ఆపుతుండగా బైక్ ఢీ

- కానిస్టేబుల్‌కు గాయాలు

ముదిగొండ: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. ముదిగొండ పోలీస్‌స్టేషన్‌కు చెందిన బ్లూ కోట్ కానిస్టేబల్ టి.శ్రీను శనివారం న్యూ లక్ష్మీపురంలో విధుల్లో ఉండగా ఓ వ్యక్తి హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళ్తుండగా ఆపే యత్నంలో కానిస్టేబుల్‌ను ఢీ కొట్టాడు. దీంతో ఆయ శ్రీను తల, నడుముకు గాయాలు కాగా వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు.

బాలుడిపై వానరం దాడి

నేలకొండపల్లి: బాలుడిపై వానరం దాడి చేసిన ఘటన మండలంలోని మంగాపురంతండాలో శనివారం చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ జైయ్‌పై ఆడుకుంటుండగా వానరం దాడి చేసి గాయపరచడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గ్రామంలో కుక్కలు, వానరాలు విజృంభిస్తున్నాయని ఇళ్లలోకి చొరబడి దాడి చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన కోరుతున్నారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం–పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ లైన్ ట్రాక్ పక్కన శనివారం గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. అడ్డం గీతలతో కూడిన తెల్లని ఫుల్ హ్యాండ్ షర్టు, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించిన ఆయన మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9848114202, 8712658589 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

వనజీవి మృతి తీరని లోటు

రామయ్య మృతిపై సంతాపం తెలిపిన ప్రముఖులు


ప్రధాని నరేంద్రమోదీతో రామయ్య.. (ఫైల్)


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో..


రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో వనజీవి (ఫైల్)


డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ నివాళులు..

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: విత్తనమే ఆత్మ.. మొక్కే జీవనాడి.. వనమే ప్రాణంగా జీవించిన వనజీవి రామయ్య మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం ఏ.రేవంత్‌రెడ్డి, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎక్స్ ఖాతా ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. అలాగే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ చంద్రావతి, బీజేపీ నాయకులు తాండ్ర వినోద్‌రావు సంతాపం ప్రకటించిన వారిలో ఉన్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మేయర్ నీరజ, డీఎఫ్‌ఓ సిద్దార్థ విక్రమ్ సింగ్ తదితరులు రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సీతారాంతో పాటు పార్టీలు, సంఘాల బాధ్యులు ప్రసేన్, రామారావు, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ బాధ్యులు జైపాల్, ఎస్.లలితకుమారి, పి.రాధాకృష్ణ, భూసా చంద్రశేఖర్, కె.రుక్మారావు, పగడాల నాగరాజు, విజయ్‌కుమార్, నెల్లూరి కోటేశ్వరరావు, శెట్టి రంగారావు, రవికుమార్ తదితరులు రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. దొడ్డి కొమురయ్య సినిమా సహ నిర్మాత షేక్ రెహమాన్‌తో పాటు దామళ్ల జయ, రావుల శ్రీనివాస్, భూక్యా బాలాజీ నివాళులర్పించగా, నెలనెలా వెన్నెల నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, కె.దేవేంద్ర, డాక్టర్ నాగమల్లిక రవి, డాక్టర్ వేల్పుల విజేత, జాబిశెట్టి పాపారావు, నామా లక్ష్మీనారాయణ, మేముల సదానందం సంతాపం తెలిపారు.


మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో.. (ఫైల్)


సీఎం రేవంత్‌రెడ్డితో రామయ్య దంపతులు (ఫైల్)


నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మేయర్ పునుకొల్లు నీరజ..


ఎంపీ రఘురాంరెడ్డి, నాయకులు..

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ ఖమ్మం, తల్లంపాడులో రాబోయే ఐటి హబ్, త్రిస్టార్ హోటల్, స్కూల్, ఖమ్మం టు HYD హైవే ఫేసింగ్ వెంచర్‌లో DTCP ప్లాట్స్ అమ్మబడును. సంప్ర. కాట్రపల్లి నాగరాజ్-93993 42239 [SCA-25002670]

LAND FOR SALE

■ మధిర అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ కాంపౌండ్ ప్రక్కన వరి పొలము ఒక ఎకరము 27 కుంటలు అమ్మకానికి కలదు. సం.ప్ర. 9441919603, 9154402327 [SCA 25002661]

HOUSE FOR SALE

■ రెండు అంతస్తుల బిల్డింగ్ (15 రూములు) గలది అమ్మబడును. H.No. 5-2-153, మున్సిపల్ కమ్యూనిటీ హాల్ ప్రక్కన, శాంతినగర్, రోడ్ నెం: 3 9441919603, 9154402327. [SCA 25002660]

Services

సంగీతం నేర్పబడును

■ సప్త స్వర సంగీత కళా నిలయం, మమతా రోడ్, ఖమ్మం. ఆర్. సుబ్రహ్మణ్య శర్మ శాస్త్రీయ సంగీతం నేర్పబడును. గాత్రం, వైలెన్, కీబోర్డ్. సంప్ర. 91600 30999 [SCA 25002667]

■ మీరు ఇల్లు మారుతున్నారా! గాయత్రి ప్యాకర్స్ & మూవర్స్, ఖమ్మం. (All over India) హౌజ్ కీపింగ్ సౌకర్యం కలదు. ఖమ్మం. సం.ప్ర॥ సెల్: 92478 81187 [SCA25002343]

వినికిడి సమస్యా ?

■ 25 సం॥ల అనుభవం కలిగిన ఆడియోలజిస్ట్‌చే వినికిడి పరీక్షలు మరియు అన్ని మోడల్స్‌లో చెవి మిషన్‌లకై ఫోన్ చేయండి. శ్రవణం హియరింగ్ ఎయిడ్ సెంటర్, హనుమాన్ బస్తీ, కొత్తగూడెం. సెల్: 83418 19114 [M-0983616]

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

Wanted

■ ఖమ్మం నగరంలో వైరా రోడ్డు నందుగల జిరాక్స్ & ఇంటర్నెట్ సెంటర్‌నందు పని చేయుటకు యువతీయువకులు కావలెను. మరియు కంప్యూటర్ వర్క్ నేర్చుకుందామనే ఆసక్తి ఉన్నవారు సం.ప్ర. 70139 46874 [SCA 25002734]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ:18k Ph: 9640400073, 9160900024 [SCA25002716]

■ తన్మయిఓల్డేజ్‌హోమ్, YSRసర్కిల్‌వద్ద VJA పెద్దవారికి సేవచేయుటకు ఆడా, మగ వర్కర్లు, వంట మనుషులు కావలెను. వ: 20–50 సం॥. 9652423559/7093911010/9573000987 [HA-29]

■ ఖమ్మం లోకల్ అనుభవం ఉన్న బ్యాచిలర్ కార్ డ్రైవర్స్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం. సం.ప్ర. ఫోన్: 78421 69987 [SCA 25002699]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీ: 20-25000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-1270235]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.